# స్వప్నం

నేను ఆఫీస్ కెళ్తూ వచ్చేటప్పుడు పరిసరాలను గమనిస్తుంటాను. ముఖ్యంగా గోడలు, వాటిమీద ప్రకటనల్నే కాదు. ఒక్కోసారి ఏ అనామక కవో అద్భుతమైన కవిత్వం రాస్తుంటాడు.

అంతేకాదు మన వీధులూ, రోడ్లూ ఒక్కోసారి ఎంత అద్భుతంగా ఉంటాయో చాలాసార్లు అంత భయానకంగానూ ఉంటాయి.

ఇక్కడ ఎండల్లో, వానల్లో, చలిలో శరీరం మీద ఏ ఆచ్ఛాదన లేకుండా ఎక్కడో, ఎవరికో పుట్టి బతుకులు కాల్చేసుకున్న రకరకాల అభాగ్యుల ఆర్తనాదాలు ఈ రాస్తాల్లోనే మారు మ్రోగుతుంటాయి.

వాటిని లారీల, కార్ల, స్కూటర్ల శబ్దాలు మింగేస్తాయి.

మనకు ఏ దృశ్యమైనా అరుదుగా కనపడితే ఆశ్చర్యపడతాం. అద్భుతంగా చూస్తాం.

కానీ రోజూ అవే దృశ్యాలు ఎదురైతే అలవాటు పడిపోతాం.

నాకు అరుదైన దృశ్యాల్తోపాటు రోజూ చూసే దృశ్యాల్లో కూడా ఏవేవో మార్పులు కనిపిస్తుంటాయి మంచిగానో, చెడుగానో!

రెండు రోజుల క్రితం నేను ఆఫీస్‌కు వస్తున్నప్పుడు గడ్డం బాగా పెరిగిన ఓ వ్యక్తి మెయిన్‌రోడ్డు మీద కొంతభాగాన్ని శుభ్రం చేయటం కనిపించింది.

ముందు ఎందుకా అనుకున్నాను.

ఆ తర్వాత అర్ధమైంది. మరికొద్ది సేపట్లో అతను అక్కడేదో బొమ్మగీస్తాడు.

ఈ దేశంలో చిత్రకళ ఇలా రోడ్లమీద పడటం పట్ల నాకు బాధ ఉంది.

జాగ్రత్తగా గమనిస్తే ఇక్కడ చాలా చిత్రమైన విషయాలు తెలుస్తాయి. ఇలాంటి వారందరూ కేవలం కడుపుకోసం ఈ చిత్రాలు గీస్తారు. అందుకే ఎక్కువగా దేవుళ్ళ బొమ్మలు గీయటం.

అవయితేగానీ జనం బాగా డబ్బులు వేయరు.

అంటే ఈ చిత్రకారులకు కూడా ఏ బొమ్మలకు మార్కెట్ ఉందో ఆ బొమ్మలే వేయాలనే స్పృహ ఉందన్నమాట

ఓరకంగా అలాంటి దృక్పథం కథలూ, నవలలూ రాసుకునే వారిలోనే ఉంటుందని నేను నమ్మేవాడ్ని.

నాకు ఈ చిత్రకారుల చిత్రాలు నచ్చుతాయా, నచ్చవా అనేదీ అలా ఉంచుతాను.

వీళ్ళలో ఇంత అద్భుతమైన శక్తులున్నాయి కదా.... ఇంత అద్భుతంగా దేవతల్ని చిత్రిస్తున్నారు కదా... మరో రకం చిత్రాలు ఎందుకు సృష్టించకూడదు?

మరోరకం చిత్రాలంటే ఏవి అనే సమస్య వస్తుంది వెంటనే.

దరిద్రం గురించి గీయాలా? ప్రకృతి అందాల గురించి గీయాలా? ఏ చిత్రాల్ని రోడ్డుమీద బొమ్మలు వేసేవారు గీయాలి?

ఈ విషయం నేను ఖచ్చితంగా చెప్పలేను.

ఏ చిత్రాలు గీస్తే కడుపు నిండుతుందో వారికంటే వేరెవ్వరికీ తెలియదనుకుంటాను.

నా అభిరుచి ప్రకారం గీస్తే అతనికి కనీస ఖర్చులైనా వస్తాయో, రావో నేను చెప్పలేను.

అయితే భగవంతుడి పట్ల నాకు నమ్మకం లేదు కాబట్టి, ఆ బొమ్మల్ని చూస్తుంటే నాలో ఎక్కడో అసంతృప్తి తలెత్తుతుంది. ఓ

రకంగా ఇది ప్రజల బలహీనతను సొమ్ము చేసుకోవటమే. ప్రజల్లో అజ్ఞానాన్ని మరింతగా పెంచటమే.

ప్రజల్ని ఇంకా ఎక్కువగా ఎవరిమీదో ఆధారపడేలా చేయడమే.

అంతలోనే అనిపిస్తుంది...

ఇలా బొమ్మలు గీయటం వలన వీళ్ళకే మాత్రం లభిస్తుంది.... మహా అయితే రెండు పూట్ల భోజనం చెయ్యవచ్చు. అది కూడా నమ్మకం లేదు. ఆ బొమ్మలకేసి చాలాసేపు చూసి వెళ్ళిపోయేవారు అనేకమంది ఉంటారు.

ఒక్కోసారి ఆ బొమ్మలమీద ఏ చిల్లర నాణాలూ పడకపోవచ్చు.

బతుకు తెరువుకోసం ఈ కళను జీవన మార్గంగా ఎంచుకున్న ఆ బడుగు జీవిపట్ల శత్రు వైఖరిని కలిగి ఉండటం, కనీసం అలాంటి ఆలోచనలు రావడం నాకు ఆశ్చర్యం కలిగించింది.

ఈ దేశంలో అనేక మంది మేధావులూ, నిబద్ధత కలిగినట్లు చెప్పుకునే కళాకారులూ, రచయితలూ, రచయిత్రులూ కూడా అనేక విషయాల్లో రాజీ పడుతున్నారు. తమకు ఇష్టం లేనివి కూడా ప్రచారం చేస్తున్నారు-కనీస జీవితం ఉండి!

అలాంటిది ఓ సాధారణ చిత్రకారుడి గురించి ఈ రకమైన ఆలోచనా విధానం పొరపాటనుకుంటాను.

అయినా ఓ వాస్తవం ఏమిటంటే ...

నాలా ఆలోచించేవారు కూడా ఈ సమాజంలో చాలామంది ఉన్నారు. రంధ్రాన్వేషణ కూడా ఓ ధోరణిగా ఉంది.

ఈ సమాజం ఇలా ఉండటాన్ని, ఈ సాహిత్యమూ, ఈ కళలూ ఇలా ఉండటాన్ని ఆమోదించనివారు సైతం పొరపాటు నిర్ణయాలకు రాక తప్పదేమో!

పొరపాటు అంటే అర్థం చేసుకోవటంలో పొరపాటు అది.

అదలా ఉంటే...

నాకు ఇక్కడ మరో అనుమానం వచ్చింది.

ఏ కళలోనైనా అనుభూతి ప్రధానం అనుకుంటాను. అనుభూతి లేనివాడు అసలు కళాకారుడు కాలేడేమో?!

చాలాకాలం వరకు ఈఅభిప్రాయం నాలో బలంగా ఉండేది.

కాని ఈ నడుమ అలాంటి భావాన్ని బలంగా అంటిపెట్టుకు ఉండటానికి నా మనసు అంగీకరించటం లేదు.

నేను చదువుతున్న రచనలు-ముఖ్యంగా ఈనాటి కథలూ, నవలలూ నన్ను ఆ స్థితికి నెట్టి ఉంటాయని భావిస్తున్నాను.

వీటన్నింటా నేను అవసరాలను మించి అనుభూతుల్ని చూడలేక పోతున్నాను.

ఓ రకంగా ఏకపక్షంగా, అలా రాస్తున్న వారందరికీ అనుభూతి లేదని తీర్మానించటం దారుణమే.

కానీ అది నా నేరం కూడా కాదు.

నేనేం భావిస్తున్నానో అదే చెప్పాను.

కవో, రచయితో తాను అనుభూతి చెంది రాస్తే, అందులో పాఠకుడు కూడా తాదాత్మ్యం చెందుతాడు.

ఈనాటి రచనల్లోనూ నేను అలాంటి స్థితిని పొందినవి కొన్ని ఉన్నాయి. మరికొన్నింటిలో నేనలాంటి అనుభూతిని గమనించకపోవటం నా లోపం కావచ్చునేమోగానీ, నా అహం అందుకు అంగీకరించదు.

అందుకే అంటాను. చాలా చాలా రచనలు అనుభూతి రాహిత్యంతో అవసరాల కోసం పుడుతున్నాయి.

మరి ఈ చిత్రకారుడూ ఇంతేనా ?

బతకటం కోసం ఇతనూ అలాంటి స్థితినే పొందాడా?

ఇతనూ ఓ యంత్రం లాంటి కళాకారుడేనా ?

ఓ చిత్రం సృష్టించటానికి అతనిలో అంతర్మథనం చెలరేగదా ?

ఏ ఆవేశాలూ, ఏ ఆరాటాలూ, ఏ సంఘర్షణా లేకుండానే అతను చిత్రాలు గీస్తున్నాడా ?

ఇలా ఆలోచించటం నాకు బాధాకరంగానే ఉంది. జీవితంలో అన్నీ ఉండి, బాగా అనుభవిస్తూ కూడా ఓ రకమైన కీర్తికోసం, డబ్బు కోసం ఆరాటపడే వారిని నేనేం అనలేకపోతున్నాను.

జీవించటానికి మరో మార్గం దొరక్క ఇలా రోడ్లమీద కొచ్చిన వ్యక్తుల నుండి ఏదో ఆశించడం ఏమిటి?

అంతలోనే నాకనిపిస్తుంది...

వీళ్ళు నిజమైన కళాకారులు...తమకున్న అతి తక్కువ అవకాశాల్లోనే వీరు తమ కళలకు పదును పెడుతున్నారు.

ఏమైనా వీళ్ళకు అనుభూతికన్నా ముందు బతకటం కావాలి.

అందుకే ముందు నేను ఇలాంటి విషయాల్ని మరింత నిశితంగా పరిశీలించాకగానీ ఓ నిర్ణయానికి రాకూడదు.

నా మనసులో ఇంకో ఆలోచనకూడా ఉంది.

వ్యాపార ప్రపంచంలో పడి కొట్టుకు పోతున్నవారికి ఎటూ ఫేమ్‌తో పాటూ డబ్బు కావాలి. లేకపోతే వారి 'ఇగో'ను వారు సంతృప్తిపరచుకోలేరు. ఖచ్చితంగా చెప్పాలంటే వారి 'అహమ్' వారి అనుభూతి అనుకుంటాను.

కానీ...

రోడ్డుమీద బొమ్మలువేసి బతకాలనుకునే వ్యక్తికి ఈ కళ పట్టుబడటానికి కారణం ఖచ్చితంగా అనుభూతే కావాలి. అలా చిత్రకారుడిగా ఎదిగి గత్యంతరంలేని పరిస్థితుల్లో ఇలా బతకటం కోసం సిద్ధపడిఉండాలి.

అంతేగానీ...రోడ్లమీద బొమ్మలు గీసుకొని బతుకుదాం అని ఎవరూ ఈ కళను నేర్చుకోరని నా గట్టి నమ్మకం!

నవలలు రాస్తే గొప్ప జీవితం రాగలదని తయారవటం ఆశ్చర్యం కాదు!!

ఈ రెండు రోజులుగా ఈ చిత్రకారుడు నాకెలాంటి సంతృప్తిని కలిగించలేదు. అతను ఏవేవో బొమ్మలు గీశాడు. అందులో దేవుళ్ళూ, దేవతలూ ఉన్నారు ఇంకా చెప్పాలంటే రెండు మతాలకు చెందిన చిత్రాలు గీశాడు.

అతని 'సెక్యులర్' తత్వం నన్ను ఆకర్షించింది. ఈ రెండు రోజులా ఆ బొమ్మలమీదపడ్డ నాణాల్ని నేను లెక్కపెట్టాను.

ఈ రోజు పెత్తుంటే గమనించాను.

అతను మరికొంత భాగాన్ని శుభ్రం చేసి, నాలుగుపక్కలా సరి హద్దులుగా రాళ్ళను పెట్టాడు. నేను చూస్తూ నిలబడ్డాను.

అతను నల్లగా ఉన్నాడు. గడ్డం బాగా పెరిగి ఉంది. ఆ కళ్ళలో ఆత్మ విశ్వాసంతోపాటు తీక్షణమైన వెలుగూ ఉందనిపించింది. ఓ మూలన ఉన్న తన మాసిపోయిన సంచిని మెల్లగా దులిపాడు.

చిన్న గుట్టగా రంగురంగుల చాక్‌పీస్‌లు పడ్డాయి. వాటితోపాటు బొగ్గు ముక్కలు కూడా ఉన్నాయి. అవన్నీ చిన్న చిన్న ముక్కలుగా రకరకాల రంగుల్లో చూట్టానికి అదో చిత్రంలో, మోడ్రన్ ఆర్ట్‌లా కనిపించాయి.

శుభ్రం చేసిన ఆ ప్రాంతాన్ని తృప్తిగా చూసుకున్నాక, చాక్‌పీస్ ముక్కలూ, ఓ నల్లటి గుడ్డముక్క, ఓ బొగ్గుముక్క అందుకుని ఓ మూలన స్కెచ్ లాంటిది గీసుకొని ఆ బొమ్మకు ప్రాణప్రతిష్ట చేయటం ఆరంభించాడు.

నాకు అరగంటసేపు చూసినా అతనేం గీస్తుందీ అర్థం కాలేదు.

నేను ఆఫీస్‌కు వెళ్ళిపోయాను.

లంచ్ సమయంలో నేను తిరిగి బజారుకి రావాల్సి వచ్చింది. కుతూహలంగా అక్కడకు వెళ్ళాను. అతనింకా తదేకంగా గీస్తూనే ఉన్నాడు.

అతని నుదుటిమీద చెమట బిందువులు కనపడుతున్నాయి. అతని చేతులు రకరకాల రంగుల్ని పులుముకొన్నాయి. అతను కనీసం మంచి నీళ్ళయినా తాగి ఉంటాడా అనిపించింది.

అప్పటికి కొంత చిత్రం తయారైంది. జనం కొద్దిసేపు నిలబడి చూసి వెళ్తున్నారు. నేను కొంచెంసేపు అలానే నిలబడి చూశాను. అతను తదేకంగా, నిశ్చల దృష్టితో ఆ బొమ్మను చిత్రిస్తున్నాడు.

నేను తిరిగి వెళ్ళిపోయాను.

సాయంకాలం ఆఫీస్ నుండి ఇంటికి వస్తూ వెళ్ళాను.

ఆ చిత్రం ఇంకా పూర్తి కాలేదు.

మొత్తం మీద ఆ చిత్రం 'కృష్ణుడి' విశ్వరూపం అని అర్థం చేసుకో గలిగాను.

నేను గమనించిన అంశం మరోటుంది.

అతను ఇలా రోడ్డును ఆక్రమించుకోవటంవల్లా, దాని చుట్టూ జనం నిలబడటం వల్లా, ట్రాఫిక్కి కలుగుతున్న ఇబ్బందుల వల్లా విసుక్కుం టున్నవారూ ఉన్నారు.

"ఈ పోలీసులు అట్లా తయారయ్యారు. పైసలకి కక్కుర్తిపడి ఇలా రోడ్లమీద బొమ్మలు వేస్తున్నా ఊరుకొంటారు. ఈ రోడ్లు అడుక్కు తినేవారికీ, తోపుడు బండ్లవారికి, ఇలాంటి వారికే."

ఓ స్కూటరిస్టు పెద్దగానే నిరసన వెలిబుచ్చాడు.

ఈ రోడ్లు కాంట్రాక్టర్ల కోసమూ, అధికారుల కోసమూ, రాజకీయ నాయకుల కోసమూ మాత్రమే కాదనీ, ఈ దేశంలో కోట్లాదిమందికి రోడ్లే భవనాలనీ, చెల్లే ఆశ్రమాలనే విషయం చెప్పి అతన్ని అంగీకరింప చేయటం కష్టం. పాపం అతను మాత్రమేం చేస్తాడు. లోకంలోని అన్యా యాలన్నింటినీ నిరసించటానికి అతనేం నాయకుడు కాదు.

తనకు ఎప్పుడు బాధకలిగితే, అప్పుడు మాత్రమే విరుచుకుపడే అనేకానేక మందిలో తనూ ఒకడు.

ఇలాంటివేవీ అతని దృష్టిని మరల్చలేదు.

రంగురంగుల చాక్‌పీసులు పొడిగా మారి ఆ చిత్రంలో ఐక్యమౌ తున్నాయి.

క్రమంగా చీకట్లు ముసురుతుంటే నేను వెళ్ళిపోయాను. ఇంటిదగ్గర నాకు కాలు నిలవలేదు. భోంచేసి, లుంగీమీద తిరిగి బయలుదేరాను.

ఓ సీసాలో కిరసనాయలు పోసి వెలిగించిన వత్తి కాంతిలో అతను ఆ చిత్రానికి తుదిమెరుగులు దిద్దుతున్నాడు.

నేను అలానే నిలబడ్డాను.

అతని ముఖంలో అలసట స్థానంలో క్రమంగా ఏదో తృప్తి చోటు చేసుకోవటం నేను గమనించాను.

ఆ బొమ్మలోని ప్రతి భాగాన్ని ఎంతో జాగ్రత్తగా తీర్చిదిద్దాడు.
అది కృష్ణుడి విశ్వరూపమే కాదు...
ఆ చిత్రకారుడి విశ్వరూపం కూడా!

ఇంక ఆ బొమ్మ అయిపోయిందికదా అనుకున్నాను. అప్పుడు తన సంచి నుండి ఓ పొట్లం తీశాడు. అందులో నుండి ఏదో తీసి ఆ బొమ్మమీద అక్కడక్కడా జల్లాడు.

ఆకాశంలో వెన్నెల వెలుగులు తళుక్కుమన్నాయి.

ఆ మెరుగులు వజ్రపు ముక్కల్లా మిలమిలా మెరుస్తున్నాయి. ఆ వెన్నెల వెలుగుల్లో 'కృష్ణ భగవానుడు' ధగధగలాడుతున్నాడు.

అదంతా పూర్తయ్యేసరికి మరో పావుగంట పట్టింది.

అతను నాలుగు ప్రక్కలనుండి ఆ చిత్రాన్ని చూసుకున్నాడు. అంతకుముందు తనకు నచ్చని భాగాల్ని రెండు మూడుసార్లు తుడిచి తిరిగి చిత్రించాడు.

అతని కళ్ళలో మెరుపులు!

మిగిలిపోయిన బొగ్గు ముక్కల్నీ, చాక్‌పీసుల్నీ తిరిగి తన సంచిలో పోసుకున్నాడు. రోడ్డుపక్కకొచ్చి కూర్చుని జేబు వెతుక్కున్నాడు. సగం కాల్చిన సిగరెట్ అందుకుని వెలిగించాడు. గుండెలనిండా పొగను పీల్చి కళ్ళు మూసుకున్నాడు.

అది తృప్తా? అనుభూతా? ఏమిటది?
ఏమో

రోడ్డుమీద జనం పలచగా ఉన్నారు. వారిలో కొందరు వచ్చి ఆ చిత్రంకేసి అద్భుతంగా చూస్తున్నారు. మరికొందరు భక్తితో నమస్కరిస్తున్నారు. ఇంకొందరు ఆ బొమ్మమీదకి నాణాలు విసురుతున్నారు.

నేను ఆ చిత్రానికి చెందిన ఆధ్యాత్మిక భావనను వదిలివేసి చూస్తే నిజంగా అదో అద్భుత చిత్రం.

అలాంటి బొమ్మనే రంగుల్లో, ఆఫ్‌సెట్ ముద్రణలో ప్రచురించి అమ్మితే మంచి ధరకు కొనుక్కొని పటాలు కట్టించుకుంటారు.

ఇవేమి కాదు నన్ను ఆకర్షించింది.

ఆ కళాకారుడి మధన.

ఉదయం నుండి అతను ఆ చిత్రం గీస్తున్నాడు. అనేకసార్లు అతనికి సంతృప్తి కలగలేదు. మరలా మరలా ఆ చిత్రానికి కొత్త రూపు నిచ్చాడు.

ప్రతి చిన్న అంశాన్నీ, ఎంతో నిశితంగా, నిజాయితీగా పరిశీలించి తీర్చిదిద్దాడు.

రెండు రోజులుగా తను రెండుపూటలా భోంచేశాడని కూడా నేను భావించడం లేదు. ఆ రెండు రోజులనుండి వచ్చిన అయిదూ, పదితో ఈనాటి బొమ్మకు కావలసిన రంగులూ, మెరుగులూ కొని ఉంటాడు.

తను ఉదయం నుండి రాత్రి ఎనిమిదిన్నర గంటల దాకా ఏ మట్టి పనికి వెళ్ళినా ఇంతకంటే ఎక్కువ డబ్బులు వస్తాయి.

అయినా అతను ఈ చిత్రాన్నే గీశాడు!

ఎందుకు?

అనుభూతి కోసమా? జీవితం కోసమా ? భక్తి భావనా?

వీటిలో అన్ని అంశాలకూ ప్రాధాన్యత ఉండొచ్చు.

కానీ అతను కళాకారుడు....

అతని హృదయంలో ఎంత ఘర్షణ అనుభవించకపోతే ఇలాంటి కళాఖండం ఆవిర్భవిస్తుంది!

అందుకే నేను నిర్ణయించుకుందాకటే....

ఎక్కడ కళ రోడ్లమీద పడుతుందో.... ఎక్కడ దరిద్రం అనంతానంతంగా విరుచుకుపడుతుందో అక్కడ మనం చూడాల్సింది ఆ కళని.

అదింకా సజీవంగా ఉన్నందుకూ ....

ఆ కళాకారులింకా వాటినే నమ్ముకున్నందుకూ...

వారిని సానుభూతితో అర్థం చేసుకోవాలి.

నా జీవితంలో మొదటిసారిగా అప్రయత్నంగా నా చెయ్యి జేబు లోనికి వెళ్ళింది. ఎంత కాయితం వచ్చిందో కూడా నేను గమనించలేదు. మౌనంగా ఆ బొమ్మమీద ఉంచేసి వెళ్ళాను.

రాత్రంతా నా ఆలోచనల్లో, ఆ చిత్రకారుడూ, ఆ బొమ్మా మెదిలారు ఉషోదయాన లేచాను.

ఎవరితోనూ మాట్లాడలేదు. త్వరగానే ఆఫీస్‌కు బయలుదేరాను. అక్కడ ఇంకా జనం గుంపులు గుంపులుగా ఉన్నారు.

వారందరినీ ఆ బొమ్మే ఆకర్షించిందో, ఆ భగవంతుడే ఆకర్షించాడో నాకు తెలియదు. ఆ బొమ్మ మీద నాణాలు కనిపిస్తున్నాయి.

అందులో పోలీసుల కెంత వాటా ఉంటుందో... అతనికెంత వస్తుందోగానీ, ఆ చిత్రకారుడు ఈ ప్రపంచంతో తనకే సంబంధం లేనట్లుగా ఎటో చూస్తున్నాడు.

నేను సాయంకాలం, తిరిగి రాత్రీ వెళ్ళాను. ఆ దృశ్యం అలానే ఉంది. ఆ ప్రాంతమంతా ఎంతో పవిత్రంగా చూడబడుతోంది. తిరిగి నా కలల్లో ఆ దృశ్యాలే!

అతని ఆరాటం, నిశితమైన దృక్పథం... మరీ ముఖ్యంగా పూర్తయిన తన చిత్రాన్ని చూసుకున్నప్పుడు ఆ కళ్ళలో కనిపించిన తృప్తి....

ఓహ్.... ఎంత అద్భుతం!

ప్రతి కళాకారుడికీ, రచయితకూ తప్పనిసరి అంశాలవి!

మళ్ళీ ఉదయం ...

నేను ఆఫీస్‌కెళ్తూ చూశాను.

రోడ్ల మీద వాహనాలు అటూ, ఇటూ తిరుగుతున్నాయి. అక్కడ ఏ గుంపులూ లేవు. ఆత్రంగా పరిగెత్తుకుంటూ వెళ్ళాను.

ఆ రోడ్డు మీద రంగు రంగుల మరకలింకా కనపడుతున్నాయి.

చాలామందికి నిన్న ఇదే స్థానంలో ఓ అద్భుత దృశ్యం తమను అలరించిందనే విషయం జ్ఞాపకం లేదు.

నాకు ఆ చిత్రకారుడు గుర్తొచ్చాడు. ఆ వదనం గుర్తొచ్చింది.

ఈ రోడ్డుమీది చిత్రకారుడు ఎంత దురదృష్టవంతుడు?!

రెండు రోజుల క్రితం ఆ చిత్రాన్ని సృష్టించడానికి ఎంత మదన పడ్డాడో...

ఎంత అనుభూతి చెందాడో ...

ఆ కమనీయ సృష్టిని తన చేత్తోనే తుడిచేయాల్సిన క్షణంలో...

ఆ కళ్ళనుండి రక్త పు బొట్లు రాలి ఉండవూ...!

ఏ చిత్రకారుడైతే ఓ చోట తమ కళాఖండాల్ని 'ఫ్రేమ్స్' నడుమ భద్రంగా బిగించి ఈ ప్రపంచం ఎదుట శాశ్వతంగా నిలపాలని ఆరాట పడతాడో...

అదే చిత్రకారుడు మరోచోట తన చిత్రాల్ని తనే చెరిపేసుకోవాలి.

కొన్ని దారులు గతుకుల్తో, ముళ్ళతో ఉంటే, మరికొన్ని పూల బాటలు.

ఒకరి అనుభూతి వారిని అంతులేని ఎత్తులకు తీసుకెళ్తే ...
మరొకరి అనుభూతి అశ్రువుల్ని రాలుస్తుంది.
అదే నిజం ...
కళాకారుడు అనుభూతి కోసమే జీవిస్తాడు.
కీర్తి, డబ్బూ అందించే అనుభూతితో కొందరు.
'కళ' అందించే మానసిక తృప్తితో మరి కొందరు....
నేను ముందే చెప్పినట్లుగా
ఈ రోడ్లు స్వప్నాల్ని పూస్తాయి.
స్వప్నాలు రెండు రకాలు.
అనుభూతిని కలిగించేవీ....
భయాన్ని రేకెత్తించేవీ!!

—'హారిక' వారపత్రిక